సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామిని అర్చించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలను నిర్వహించారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 22వ రోజు సోమవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి జరిపారు. ఈ రోజు కూడా స్వామివారు నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుప్పావై 22వ పాశుర విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

పౌష్టికారంపై అవగాహన



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులు

పెందుర్తి: స్థానిక నల్లక్వారీ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లల తల్లులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కార్యకర్త బుద్ధ భవానీ పలు అంశాలపై అవగాహన కలిగించారు. తల్లుల ఆరోగ్యం, పిల్లల పోషణకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. స్థానిక పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్ అవిష్కరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం అవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోకూరి శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, ఉపాధ్యాయులు పైల దేముడు, బొడ్డు అర్జున, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో న్యూ బ్రేకర్స్ నిర్మాణంలో భాగంగా సెక్షన్–1 పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.



గోశాల లేఅవుట్‌లో సింహగిరి నిర్వాసితుల కాలనీ

వారంతా..
సింహాద్రినాథుడిని నమ్ముకుని, తరతరాలుగా కొండపైనే నివాసం ఏర్పరచుకున్నారు. 2008లో ప్రారంభమైన సింహగిరి దివ్య క్షేత్రం అభివృద్ధి పనులు వారిని నిర్వాసితుల్ని చేశాయి. కష్టమే అయినా.. ఇష్టదైవానికి చెందిన దివ్యక్షేత్రం అభివృద్ధిలో తమ వంతు సహకరించారు. కొండ దిగువన దేవస్థానం కేటాయించిన ప్రత్యామ్నాయ స్థలాలకు తరలివెళ్లారు. అయితే 16 ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ వారికి తాము నివసిస్తున్న స్థలాలపై శాశ్వత హక్కులు కల్పించలేదు.



అప్పన్నకు దూరమై.. తీరని వేదనై..

- శాశ్వత భూహక్కుల కోసం 16 ఏళ్లుగా నిరీక్షణ
- ప్రభుత్వాలు మారినా... బతుకులు మారలేదు
- సింహగిరి దివ్యక్షేత్రం అభివృద్ధి నిర్వాసితుల ఆవేదన

సింహాచలం:

సింహగిరిపై 2008 వరకు గ్రామం ఉండేది. సుమారు 200 కుటుంబాలు నివసించేవి. వీరిలో చాలామంది తమ పూర్వీకుల నుంచి సింహగిరిపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దేవస్థానంలో ఉద్యోగం చేసే వలువురు వైదికులు, సిబ్బంది కూడా తరతరాలుగా కొండపైనే నివాసం ఉండేవారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగే నిత్య, వార్షిక ఉత్సవాలు, తిరువీధులు నివాసిత కుటుంబాలతో కళకళలాడుతూ ఉండేవి. ఏ ఉత్సవం జరిగినా తిరువీధిగా తమ ఇళ్ల ముందుకు వచ్చే స్వామికి పసుపుకుంకుమలు, హారతులు సమర్పించేవారు. దివ్యక్షేత్రం అభివృద్ధి పనులు వారి పాలిట శాపంగా మారాయి. తమ ఇష్ట దైవానికి దూరంగా తరిమేయడంతోపాటు.. ప్రత్యామ్నాయ వసతులపై హక్కుల కోసం పదేపదే వేడుకునే పరిస్థితిని తీసుకొచ్చాయి.

సమిధలుగా మిగిలి

దివ్యక్షేత్రంగా సింహగిరి అభివృద్ధికి పరిసర ఇళ్ల తొలిగింపు తప్పనిసరైంది. తొలి విడతలో రాజగోపురం ఎదురుగా ఉన్న రాజవీధిలో ఇళ్లను, రెండో విడతలో ఎగువవీధి, కొండవీధిలో ఉన్న ఇళ్లను తొలగించి గ్రామాన్ని ఖాళీ చేయించారు. వీరందరికీ కొండదిగువన గోపాలపట్నం వెళ్లే రహదారిని ఆనుకుని గోశాల జంక్షన్‌లో వుడా సహకారంతో లేఅవుట్ వేసి 60 గజాలు, 106 గజాలు, 166 గజాలు, 266 గజాలు చొప్పున ప్లాట్లు వేసి, పట్టాలు అందించారు. సింహగిరిపై ఉన్న ఇళ్లకు మాత్రమే స్ట్రక్చరల్ నష్టపరిహారం ఇచ్చారు. ఖాళీ స్థలాలకు, కమర్షియల్ బిల్డింగులకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. ఇచ్చిన పరిహారం చాలక కొందరు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. చేతిలో నగదులేక మరికొందరు ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకోలేదు. స్థలాలపై రిజిస్ట్రేషన్ హక్కు కల్పించకపోవడంతో బ్యాంకు రుణాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



నిర్మాణాలు చేపట్టలేకపోవడంతో తుప్పలతో నిండి ఉన్న ప్లాట్లు

బాధలు వర్ణనాతీతం



రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవల్స్ రావడంలేదు. యూజర్ చార్జీలు, హౌస్‌టాక్స్ రెట్టింపు కట్టాల్సి వస్తోంది. పిల్లల చదువుల కోసం, పెళ్లిళ్ల కోసం స్థలం/ఇల్లు బ్యాంకులో తాకట్టు పెడదామన్నా వీలుపడని దుస్థితి. బ్యాంకులు వీటిపై ఏ విధంగానూ లోన్లు ఇవ్వట్లేదు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియట్లేదు. రిజిస్ట్రేషన్లు జరిగేలా దేవస్థానం అధికారులు చూడాలి.

– ఎస్.చిన్నారావు, నిర్వాసితుడు

పిల్ వేయాలని కోరాం



శాశ్వత భూ హక్కు కోసం గత కలెక్టర్‌కు నివేదించాం. దీంతో దేవస్థానం గత ఈవో విచారణ జరిపారు. దేవదాయ అదనపు కమిషనర్‌తో కూడా గతంలో చర్చించాం. పంచ గ్రామాల భూసమస్య నుంచి మా ప్లాట్లను మినహాయించేలా కోర్టులో పిల్ దాఖలు చేయాలని కోరాం. దీనిపై దేవస్థానం అధికారులు పరిశీలిస్తామన్నారు. ఇటీవల రెవెన్యూ సదస్సులో కూడా మా గళం వినిపించాం.

– ముగ్గు కిరణ్, నిర్వాసితుడు

దేవస్థాన భూ సమస్యే అడ్డంకి!

గోశాల లేఅవుట్‌లో తమకి ఇచ్చిన స్థలాలకు శాశ్వత భూహక్కులతోపాటు, రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పించాలని ఆది నుంచీ నిర్వాసితులు దేవస్థానం ఉన్నతాధికారుల్ని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి. దేవస్థానానికి సహకరించి సింహగిరిని వదిలి వస్తే తమకు అన్యాయమే జరిగిందని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా ఇచ్చిన స్థలాలకు దేవస్థానం భూమస్య అడ్డంకిగా మారిందనే వాదన ఉంది. ఈ భూసమస్య కోర్టు పరిధిలో ఉండటంతో నివాసితులకి ఇచ్చిన స్థలం కూడా అందులోనే ఉందని దేవస్థానం వాదన. నిర్వాసితులు మాత్రం తాము దేవస్థానం స్థలాన్ని ఆక్రమించుకోలేదని, నిర్వాసితులుగా తమకు దేవస్థానమే ఇచ్చిందని, వెంటనే శాశ్వత భూహక్కు కల్పించాలని కోరుతున్నారు.

మేలుకొలుపులతో ఆధ్యాత్మికత



లంకెలపాలెంలో పల్లకీ ఊరేగింపులో భక్తులు

పరవాడ: ధనుర్మాసంలో నిర్వహించే మేలుకొలుపులతో గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోందని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని లంకెలపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో 22వ రోజు మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను కొలువుంచి, భగవన్నామ స్మరణ చేస్తూ వీధి వీధిన ఊరేగించారు. ఇళ్ల వద్దకు పల్లకీలో వేంచేసిన భగవంతుడిని ప్రజలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైందవ శంఖారావం సభను విజయవంతం చేసిన భక్తులందరికీ ధన్యావాదాలు తెలిపారు. మేలుకొలుపు కార్యక్రమంలో ధార్మిక జట్టు సభ్యులు, కమిటీ సభ్యులు, గురువులు, పెద్దలు, మాతృమూర్తులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



దాత వెంకన్నబాబుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక నివాసి జి.వెంకన్నబాబు రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత నగదును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో అందించారు. దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బాండ్ ఇచ్చారు. దేవస్థానం తరఫున అధికారులు దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం ,శేషవస్త్రం అందించారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

పెందుర్తి కూటమిలో ‘సహకార’ కుంపటి

- పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్ష పదవి నిర్ణయంపై జనసేనలో అసంతృప్తి
- సబ్బవరంలో గండి బాబ్జీ.. బండారు వర్గీయుల డిమ్మ్యం డిమ్మ్యం
- పరవాడ జనసేనలో అంతర్మథనం



పెందుర్తి: ‘సహకారం’ అధికార కూటమి పార్టీల్లో కుంపటి రాజేసింది. పీఏసీఎస్ కార్యవర్గాల నియామకాల్లో పదవులు ఆశించిన మండల స్థాయి నాయకులు ఆ పందేరంలో వెనుకబడి.. కాడి వదిలేస్తున్నారు. ముఖ్యంగా టీడీపీలో ఉన్న వర్గపోరు పూర్తి స్థాయిలో రోడ్డెక్కింది. మొత్తానికి బాబ్జీ టీడీపీ–బండారు టీడీపీ–జనసేన కూటమిలో పరస్పర సహకారం కరవై మంటలంటుకున్నాయి. తన పేరును కావాలనే పక్కన పెట్టారని ఆరోపిస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీరును నిరసిస్తూ సబ్బవరం టీడీపీ మండలాధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయా పదవులు ఆశించిన పెందుర్తి, పరవాడ జనసేన కేడర్‌లో కూడా అసంతృప్తి సెగ రేగుతోంది.

బండారు వర్సెస్ బాబ్జీ

చిరకాల ప్రత్యర్థులైన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు అవకాశం దొరికిన ప్రతిసారీ ఒకరిపై ఒకరు పెత్తనం చేయడం, పరోక్షంగా ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చాక పరవాడలో జరిగిన ఓ సమావేశంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సమక్షంలోనే ‘పెందుర్తికి నేనే ఇన్‌చార్జిని.. ఇక్కడ పక్క నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు, టీడీపీ నాయకులకు ఏం పని’ అని కుండ బద్దలుకొట్టారు. కొద్ది రోజుల క్రితం ‘గండి బాబ్జీ నాయకత్వంలో మేం పనిచేయం.. గండి తీరుపై సీఎం చంద్రబాబు, ఇతర పార్టీ పెద్దలకు ఫిర్యాదులు చేస్తామని’ చింతగట్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బహిరంగంగానే ప్రకటించి, ఫిర్యాదులు కూడా చేశారు. ఈ క్రమంలో తాజాగా సబ్బవరం పీఏసీఎస్ చైర్మన్ పదవి గండి బాబ్జీ వర్గీయుడైన గండి దేముడుకు కేటాయించడంతో ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షుడుగా ఉన్న మిడతాడ మహాలక్ష్మినాయుడు(బండారు వర్గీయుడు) గండి తీరుపై నిరసనగా పదవికి రాజీనామా చేయడం స్థానికంగా సంచలనం రేగింది.

జనసేనలో అంతర్మథనం

కూటమి పంపకాల్లో భాగంగా సబ్బవరం పీఏసీఎస్‌ను టీడీపీకి కేటాయించగా.. పెందుర్తి, లంకెలపాలెం(పరవాడ) పీఏసీఎస్‌లను జనసేన అట్టిపెట్టుకుంది. ఈ క్రమంలో పెందుర్తి చైర్మన్ పదవికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రధాన అనుచరుల్లో ఒక్కడైన అయితా సింహాచలం పేరును ప్రతిపాదించారు. ఈ నిర్ణయంపై ఎమ్మెల్యే వద్ద నలుగురైదుగురు గ్రామీణ ప్రాంత జనసేన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. లంకెలపాలెం పీఏసీఎస్ కార్యవర్గంపై దాదాపు పది మంది వరకు ఆశలు పెట్టుకోవడంతో దానిపై ఎమ్మెల్యే సహా జనసేన కీలక నేతలు తర్జన భర్జనలు పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. మొత్తానికి సహకార సంస్థల కార్యవర్గాల నియామకాల వేళ కూటమి సయోధ్య మరింత బీటలు వారిందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

‘ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకోవాలి’



పరవాడలో నిరసన చేపట్టిన సీఐటీయూ నాయకులు

పరవాడ: విశాఖలో ఈ నెల 8న జరగనున్న ప్రధానమంత్రి మోదీ పర్యటనను కార్మిక వర్గం అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి వద్ద బల్క్‌డ్రగ్స్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దన్నారు. ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో జిల్లా ప్రజలు అల్లాడుతున్నారన్నారు. తాగునీరు, గాలి కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు స్థాపించి గిరిజనులకు నష్టం కలిగించవద్దన్నారు. అచ్యుతాపురంలో ఎన్టీపీసీ స్థాపించనున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో నష్టపోయిన నిర్వాసితులకు, మత్స్యకారులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వి.రవి, పి.అప్పలరాజు, జి.శ్రీనివాసరావు, బి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, కె.శివ, ఆర్.సర్వేశ్వరరావు, బి.చిన్నా పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన టీడీపీ వర్గీయులపై చర్యలు తీసుకోవాలి

- అనకాపల్లి ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

పరవాడ: తమపై అన్యాయంగా దాడికి పాల్పడిన టీడీపీ వర్గీయులపై చర్యలు తీసుకోవాలని వెన్నలపాలెం గ్రామానికి చెందిన పైల మణి, ఆమె భర్త రేగారావు అనకాపల్లి ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. వెన్నలపాలెంలోని ఇంటి వద్ద ఈ నెల 2న పనిచేస్తున్న తన భర్త రేగారావుపై టీడీపీ వర్గానికి చెందిన పైల వెంకటరమణమూర్తి, పైల ప్రసాద్, బోజంకి అప్పలనాయుడు కర్రలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారని భార్య మణి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తను కాపాడుకొనే క్రమంలో తనపై కూడా దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై పరవాడ పోలీసులకు దాడి జరిగిన అదే రోజు ఫిర్యాదు చేసినా, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన టీడీపీ వ్యక్తులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధితురాలు మణి ఎస్పీకి అందించిన ఫిర్యాదులో కోరారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు



కేవీ సత్యనారాయణ, డీఎస్పీ, పరవాడ

పరవాడ: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖపట్నం పర్యటనను పురస్కరించుకుని ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. అనకాపల్లి నుంచి లంకెలపాలెం మీదుగా విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే భారీ వాహనాలు, రవాణా వాహనాలు లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ, అసకపల్లి, సబ్బవరం మీదుగా వెళ్లాలన్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలు, రవాణా వాహనాలను సిటీలోకి అనుమతించేది లేదన్నారు. కేవలం అత్యవసర వాహనాలైన అంబులెన్స్‌లు, పెట్రోల్ ట్యాంకర్లు, మిల్క్ ట్యాంకర్లు, మీటింగ్ స్థలానికి వెళ్లే వాహనాలు తప్ప, మిగిలిన వాహనాలను అనుమతించబోమన్నారు. ప్రజలు ట్రాఫిక్ మళ్లింపు చర్యల్ని గమనించి పోలీసులతో సహకరించాల్సిందిగా డీఎస్పీ కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెందుర్తి: ప్రమాదవశాత్తూ విద్యుత్ ఘాతానికి గురైన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెందుర్తి ప్రశాంతినగర్‌లో రైల్వే ఉద్యోగి అల్లబోయిన వసంతరావు, ఉమ(41) నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. డిసెంబర్ 27న మేడ మీద ఉన్న పూల చెట్ల నుంచి పువ్వులు కోసేందుకు వెళ్లిన ఉమ ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లను తాకింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మరణించింది. ఘటనపై కేసు నమోదు చేసి, పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన యశ్వంత్

పెందుర్తి: మండలంలోని పినగాడి గ్రామానికి చెందిన వాడ్రెపు యశ్వంత్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పినగాడికి చెందిన వాడ్రెపు వెంకటరావు, అతని పెద్దకుమారుడు యశ్వంత్ చిన ముషిడివాడ వుడా కాలనీ శివాలయంలో అర్చకులుగా పనిచేస్తున్నారు. అయితే యశ్వంత్ గత నెల 19న పితాపురం వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. జనవరి 1న కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

నేడు జెర్రిపోతులపాలెంలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని జెర్రిపోతులపాలెం పంచాయతీ పరిధి చింతగట్ల సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జెర్రిపోతులపాలెం రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



పూతకొచ్చిన మామిడి

‘మామిడి పువ్వుకు మాట వచ్చింది.. కోయిల గొంతుకు కూత వచ్చింది.. వేప కొమ్మకు పూత వచ్చింది.. పసిడి బెల్లం తోడు వచ్చింది.. అంటూ ఉగాదికి షడ్రుచుల పచ్చడి ఆరగించడం మన ఆనవాయితీ. అందులో మామిడికి ప్రత్యేక స్థానం ఉంది. రానున్న విశ్వావసు తెలుగు సంవత్సరాది (ఉగాది)కి సిద్ధమమ్యేందుకు మామిడి పూత దట్టంగా పట్టింది. ఉగాది మాట అటుంచితే వాణిజ్య కేటగిరీలో మెరుగైన పంటల్లో మామిడి ఒకటి. ప్రస్తుతం నియోజకవర్గంలోని మామిడి తోటలు పూర్తి స్థాయి పూత దశలో ఉన్నాయి. అంతా సజావుగా సాగి మామిడి పూత మొత్తం కాయలుగా మారాలని రైతులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం విపరీతంగా కురుస్తున్న పొగమంచు మామిడి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

– పెందుర్తి

రోడ్డుపై యూజీడీ మురుగు



కృష్ణరాయపురంలో బీఆర్‌టీఎస్ రహదారిపై ప్రవహిస్తున్న యూజీడీ మురుగు నీరు

పెందుర్తి: జీవీఎంసీ 94వ వార్డు కృష్ణరాయపురం సమీపంలోని బీఆర్‌టీఎస్ రహదారిపై యూజీడీ పైప్‌లైన్ లీకై మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దీనికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.